సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 19 జూన్ 2023



కని'పెట్'కుని ఉండాల్సిందే

ఎండల్లో మూగజీవాలను జాగ్రత్తగా చూసుకోవాలి. లేదంటే వాటి ప్రాణానికే ప్రమాదం.

- IIలో



మరణంలోనూ వీడని బంధం

సుబ్బారావుపేట జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. వీరిది బాడాం గ్రామం.

- IIలో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	43°	30
ఇచ్ఛాపురం	43°	30°
పాతపట్నం	42°	29°
శ్రీకాకుళం	43°	29°

న్యూస్‌రీల్

24 వరకు ఒంటి పూట బడులే

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రమంతా వేసవి తాపం, తీవ్రమైన ఎండల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎండలకు బాలబాలికలు ఇబ్బందులు పడకూదని భావించి మరో వారం రోజులపాటు ఒంటిపూట బడులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈనెల 24వ తేదీ వరకు బడులు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు పనిచేయనున్నాయి. ఈ ఉత్తర్వులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వర్తిస్తాయని విద్యాశాఖ స్పష్టంచేసింది. ప్రభుత్వ బడుల్లో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు రాగిజావ అందజేయాలని, అలాగే పాఠశాలలో తరగతులు ముగిసిన తర్వాత అనగా 11.30 నుంచి 12 గంటల వరకు జగనన్న గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించిన తర్వాత ఇళ్లకు పంపించాలని పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అన్ని పాఠశాలలు పక్కాగా పాటించాలని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అతిక్రమించిన బడులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఈఓ-2 పోస్టుల నియామకం పూర్తి



శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం మరింతగా ఫోకస్ చేసింది. ఇందులో భాగంగా సర్కారు బడుల నిర్వహణ, నియంత్రణ, సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేసేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మండలానికి ఒక మండల విద్యాశాఖాధికారి(ఎంఈఓ) ఉండగా.. మరో ఎంఈఓ పోస్టును కేటాయిస్తు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంఈఓ-2 పోస్టుల భర్తీ ప్రక్రియకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈఓ-2లుగా అవకాశం కల్పించారు.

38 మండలాలకు 35 పూర్తి..

విద్యాశాఖ కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా సీనియారిటీ ప్రకారం జిల్లాలో 38 మండలాల ఎంఈఓ-2 పోస్టుల భర్తీని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేపట్టారు. ఈ కౌన్సెలింగ్‌కు జిల్లాలోని పలువురు ఎంఈఓలతోపాటు 300 మందికిపైగా హెచ్‌ఎంలు హాజరయ్యారు. సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ చేపట్టగా 38 మండలాలకు గాను 35 ఎంఈఓ-2 పోస్టుల భర్తీ పూర్తయ్యింది. వీరికి కౌన్సిలింగ్‌తోపాటు నియామక ఉత్తర్వులు కూడా అందజేశారు. కవిటి, ఇచ్ఛాపురం, వంగర ఎంఈఓ-2 పోస్టుల భర్తీ జరగాల్సి ఉంది. ఆయా మండలాలకు వెళ్లేందుకు హెచ్‌ఎంలు ఆసక్తి చూపలేదు. త్వరలో అర్హులైన హెచ్‌ఎంలతో ఆ మూడు మండలాల ఎంఈఓ-2 పోస్టులను భర్తీ చేస్తామని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య చెబుతున్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ డీఈఓ ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో ఏడీ వెంకటేశ్వరరావు, పాలకొండ డిప్యూటీ ఈఓ విజయ కుమారి తదితరులు నిర్వహించారు.

'ఎంఈఓలను యథాతథంగా కొనసాగించాలి'



డీఈఓ తిరుమల చైతన్యకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుతం జిల్లాలో పని చేస్తున్న ఎంఈఓ-1 లను యథాతథంగా కొనసాగించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్ మోహన్, సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు, పొందూరు అప్పారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఈఓ ఎస్.తిరుమల చైతన్యకు ఎంఈఓ పోస్టుల కౌన్సెలింగ్ జరుగుతున్న కేంద్రం వద్ద వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ మంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో ఎంఈఓ-2 పోస్టులను జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న వారికి, ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులను మాత్రమే ప్రభుత్వ స్కూల్స్ వారికి ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈఓలను యథాతథ పరిస్థితుల్లోనే కొనసాగించాలని విన్నవించారు. అంతకుముందు ఎంఈఓ-2 పోస్టుల కౌన్సెలింగ్ జరుగుతున్న కేంద్రం వద్ద ఫ్యాప్టో ప్రతినిధులు, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలను తప్పుబట్టారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు టి.చలపతిరావు, చౌదరి రవీంద్ర, ఎస్.కిషోర్‌కుమార్, పి.దాలినాయుడు, పి.రామారావు, గోవిందరాజు, రామ్మోహన్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

దేవదేవుని ఆగమనం

- రేపే జగన్నాథ రథయాత్ర
- జగన్నాథ మందిరాల్లో రథాలు సిద్ధం



శ్రీకాకుళం కల్చరల్: దేవదేవుడు జగన్నాథుడి రథయాత్రకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పూరీ దివ్యక్షేత్రంలో యాత్ర జరిగే రోజునే జిల్లాలో కూడా పలు జగన్నాథ దేవాలయాల్లో యాత్ర జరుగుతుంది. ఈ వేడుక కోసం ఆయా ఆలయాల్లో రథాలను ఇప్పటికే సిద్ధం చేశారు. కొన్ని చోట్ల తెలుగు సంప్రదాయంతో, మరికొన్ని చోట్ల ఒడిశా సంప్రదాయంతో మంగళవారం క్రతువు నిర్వహిస్తారు.

బొందిలీపురంలో...

శ్రీకాకుళంలోని బొందిలీపురంలో ఏటా జగన్నాథ రథయాత్ర ఘనంగా జరుగుతుంది. ఈ ఆలయానికి సంబంధించి ఓ కథ ప్రచారంలో ఉంది. దాని ప్రకారం ముల్కీదాస్ మహారాజ్ దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం చేపడుతూ శ్రీకాకుళంలోని బొందిలీపురం ప్రాంతంలో సదావర్తి పులహరి తఖియా మఠం పేరుతోకూడా ఒక గుడిని కట్టారు. ఈ స్థలాన్ని ఆనాడు ఔరంగజేబు ఇచ్చినట్లుగా చెబుతారు. ఆ తర్వాత అతని శిష్యుడు రాజారాందాస్ బావాజీ పూరీ నుంచి విగ్రహాలు తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. ఈ గుడిని ఇప్పటి వరకు 11 తరాలకు చెందిన వారు కొలిచినట్లు తెలుస్తోంది. ముల్కీదాస్ బావాజీ తర్వాత మాందాస్ బావాజీ, ఉదోబ్‌దాస్, గోపాల్‌దాస్, సీటల్‌దాస్, భరత్‌దాస్, హరినారాయణదాస్, రాజారాందాస్, గంగారాందాస్ రఘువీర్‌దాస్ బావాజీలు నిర్వహించారు. వందల ఏళ్లుగా ఇక్కడ రథయాత్ర జరుగుతోందని నిర్వాహకులు లక్ష్మీదార్ దాస్, మేనేజర్ పాపారావులు చెబుతున్నారు. ఇల్లీసుపురం కూడలి వద్దగల గుండిచాలో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు.



బొందిలీపురంలోని జగన్నాథుని రథం

గుజరాతీపేటలో..

గుజరాతీపేటలోని జగన్నాథ స్వామి దేవాలయంలో తాటిరాజుల కాలంలో ఒక స్వామిజీ పూరీ నుంచి విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. పలు పనుల మీద ఇక్కడకు వచ్చిన గుజరాతీ బ్రాహ్మణ స్త్రీ ఒక కేసు గెలవడంతో మొక్కు తీర్చుకునేందుకు ఇక్కడ గుడి కట్టినట్లు వార్త ప్రచారంలో ఉంది. 1994 వరకు భట్ల విశ్వనాథం ధర్మకర్తగా పెంట వేంకటేశ్వరరావు కుటుంబం పూజార్లుగా ఈ దేవాలయంలో పూజలు జరుగుతుండేవి. ప్రస్తుతం దేవదాయ శాఖ ఆధీనంలో ఉంది. ఇక్కడ తెలుగు సంప్రదాయంలో పూజలు నిర్వహిస్తారు. 20 నుంచి 30 వరకు ఉత్సవాలు జరుగుతాయని పెంట వంశీయులు తెలిపారు.



జగన్నాథ స్వామికి రంగులద్దే కార్యక్రమంలో నిమగ్నమైన మహాపాత్రో వంశీయులు

తరతరాలుగా..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో పూరీ క్షేత్రంలో నిర్వహించినట్టుగానే జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తారు. పదిహేను రోజులుగా ఇక్కడ స్వామిని చీకటి గదికి పరిమితం చేశారు. సోమవారం నుంచి జగన్నాథుని దర్శన భాగ్యం ఉంటుంది. ఇప్పటి వరకు స్వామిని చీకటి గదిలో ఉంచి పానకం, వడపప్పు, వివిధ రకాల పండ్లు మాత్రమే నివేదించారు. జ్యేష్టపౌర్ణమి నాడు జరిగే అభిషేకాలతో అనారోగ్యానికి గురైన స్వామికి వనమూలికలతో వైద్య సేవలు చేస్తు కొత్తరూపాన్ని తీసుకువస్తారు. ఇక్కడ స్వామిని అర్చించేవారు మహాపాత్రో వంశీయులు. వీరు ఒడిశాలోని సురంగి, జరడా ప్రాంతాలకు చెందినవారు. వీరు పలు రకాల కుసుమాలు, జిగుర్లు, ఆకు పసర్లు, సుగంధ ద్రవ్యాలతో స్వామిని నవ యవ్వన రూపాన్ని తీసుకువస్తారు. సోమవారం నుంచి ఇక్కడ నేత్రోత్సవం నిర్వహిస్తారు. ప్రస్తుతం రంగులద్దే కార్యక్రమం పూర్తయ్యింది. మంగళవారం నుంచి స్వామి రథయాత్ర జరుగుతుంది.

టెక్కలి: టెక్కలిలో మంగళవారం నుంచి జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు జరగనున్నాయి. రాజు ల కాలం నుంచి ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి స్థానిక పెద్దబ్రాహ్మణవీధిలో ప్రారంభం కాబోయే జగన్నాథ రథయాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రథయాత్రతో ప్రారంభమై స్వామి గుండిచా ఆలయానికి వెళ్లి దశావతారాల్లో దర్శనమిచ్చి మారు రథయాత్రతో ఉత్సవం ముగుస్తుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ మాజీ చైర్మన్ నర్సింగ్ నాథ్ సాబతో, స్థానికుల సహకారంతో ఆలయ ఈఓ వీవీఎస్ నారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



టెక్కలిలో జగన్నాథ రథయాత్ర ఉత్సవానికి ఆలయం ఎదురుగా సిద్ధమైన రథం

ఎండలకు బండి దగ్ధం



కాలిపోతున్న ద్విచక్ర వాహనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో తీవ్రమైన ఎండ ధాటికి ఆదివారం ఉదయం 11.10 గంటల ప్రాంతంలో ఓ బైక్ కాలిపోయింది. శ్రీకాకుళం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ బి.శృంగార నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా గుర్ల వాసి బెవర శ్రీనివాసరావు తన భార్యతో కలిసి అరసవల్లి, శ్రీకూర్మం, రాజులమ్మ తల్లి దర్శనానికి ఆదివారం వచ్చారు. తిరిగి వెళ్తున్న క్రమంలో బండి నుంచి కాలిన వాసన రావడంతో అప్రమత్తమై బండి దిగి చూసేసరికి బ్యాటరీ వద్ద నిప్పు కనిపించింది. కొన్ని క్షణాల్లోనే ఆయిల్ ట్యాంక్ పైన మంటలు చెలరేగాయి. వెంటనే పక్కనే ఉన్న దుకాణాల సముదాయాల వారు నీళ్లు చల్లి, గోనెసంచితో మంటలను ఆర్పారు. ఈలోగా అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ప్రమాద తీరును, ద్విచక్రవాహనాన్ని పరిశీలించి మంటలను పూర్తిగా అదుపు చేశారు. వాహనంలో తక్కువ ఇంధనం ఉండటంతో ప్రమాదం తప్పిందని అంతా భావించారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఉత్సాహంగా పెన్‌కాక్ సిలాట్ ఎంపిక పోటీలు



ఎంపికల్లో క్రీడాకారుల ప్రతిభా విన్యాసాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పెన్‌కాక్ సిలాట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రాండ్ మాస్టర్ ఆర్.దయామయ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 75 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. రాష్ట్ర పోటీలకు 18 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో చిత్తూరు జిల్లా రేణిగుంట వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. జిల్లా పెన్‌కాన్ సిలాట్ కార్యదర్శి నక్క లక్ష్మన్నాయుడు, కోచ్ యశ్వంత్‌లు ఎంపికలను నిర్వహించారు. పోటీలకు శ్రీకాకుళం రూరల్ నుండి చిట్టి సూర్యనారాయణ, అలికాన రాము, చంద్రశేఖర్ మాస్టర్లు, రణస్థలం, లావేరు నుంచి ఈశ్వరరావు గార నుంచి శివరాం మాస్టర్లు వచ్చారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం

వజ్రపుకొత్తూరు రూరల్: రాజాం పరిసర జీడి తోటల్లో ఎలుగు సంచరించడంతో ఉద్దాన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తోటలో ఉన్న అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించేందుకు ఎలుగు ఆదివారం ప్రయత్నించింది. తాళం వేసి ఉండటంతో ఆలయం చుట్టూ తిరుగుతూ స్థానికుల కంట పడింది. వారు కేకలు వేయడంతో భల్లూకం కాశీబుగ్గ రోడ్డు వైపు జారుకుంది. పనస, మునగ తోటలకు రైతులు వెళ్తున్న కాలంలో ఎలుగు సంచరిస్తుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

తోటల్లో ఉన్న ఆలయం వద్ద సంచరిస్తున్న ఎలుగు




జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సిక్కోలు హవా

- ఐఐటీ సీట్లను దక్కించుకున్న వందలాది మంది విద్యార్థులు

ఆమదాలవలస, శ్రీకాకుళం కల్చరల్, పొందూరు, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం న్యూకాలనీ, కాశీబుగ్గ: ఆలిండియా జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సిక్కోలు విద్యార్థులు సత్తాచాటారు. ఈ ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఫలితాల్లో కొందరు విద్యార్థులు ఆలిండియా స్థాయిలో జెండా ఎగురవేయగా మరికొందరు కులాల ప్రాతిపదికన మెరుగైన ర్యాంకులు సాధించారు.

- ఆమదాలవలస మున్సిపాలిటీ లక్ష్మడిపేటకు చెందిన ఎంవీవీ హర్షవర్ధన్ ఆల్ ఇండియా స్థాయిలో 131వ ర్యాంకు, ఓబీసీలో 22వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తల్లిదండ్రులు మెండ శ్యామలరావు, విమల కుమారి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన వైశ్యరాజ్ శ్రీకార్ నిహాల్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 173వ ర్యాంకును సాధించారు. విద్యార్థి తండ్రి వీఎల్ఎస్ రాజు జీడిపప్పు వ్యాపారి. తల్లి మాధవి గృహిణి.
- శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధికి చెందిన డోల సూర్యసాయికి ఆలిండియా స్థాయిలో 302వ ర్యాంకు రాగా ఓబీసీ ఎన్‌సీఎల్‌లో 46వ ర్యాంకు వచ్చింది. సూర్యసాయి తండ్రి వలసయ్య ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్‌గా పనిచేస్తున్నారు.
- పాతపట్నం మండలం పెద్దసీది గ్రామానికి చెందిన కణితి శ్రీకార్తిక్ ఆల్ ఇండియా 346వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 53వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి కణితి మురళీ మోహన్‌రావు చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. తల్లి కొల్లేటి మాధవి కొనమూల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.
- నరసన్నపేట వంశధార కాలనీలో నివాసం ఉంటున్న నక్క అప్పన్న కుమారుడు నక్క తన్మయ్ రాఘవకు ఆలిండియా 1848వ ర్యాంకు వచ్చింది. ఓబీసీ కేటగిరీలో 314వ ర్యాంకు వచ్చింది. అలాగే మండలంలోని బాడాం స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తర్ర వెంకట రమణమూర్తి కుమారుడు తర్ర సాయి చరణ్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 2035వ ర్యాంకు సాధించాడు. ఓబీసీలో 351 ర్యాంకు వచ్చిందని తండ్రి వెంకటరమణ మూర్తి తెలిపారు. వీరి స్వగ్రామం జలుమూరు మండలం జోనంకి.
- టెక్కలి మండలం జెండాపేట గ్రామానికి చెందిన తిప్పాన లిఖితారెడ్డి ఆలిండియా స్థాయిలో 4489 ర్యాంకు సాధించగా, ఓబీసీ కేటగిరిలో 857 ర్యాంకు సాధించింది. అలాగే ఇదే గ్రామానికి చెందిన దల్లి మణిదీప్ ఆలిండియా స్థాయిలో 5581 ర్యాంకు సాధించగా, ఓబీసీ కేటగిరీలో 1091 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఇరువురు విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.
- పొందూరుమండలంలోని తోలాపి గ్రామానికి చెందిన దుంపల హిమ కార్తీక జనరల్ విభాగంలో 9324వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 2117వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి దుంపల సన్యాప్పారావు నారాయణ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.



హర్షవర్ధన్ (131), శ్రీకర్‌నిహాల్ (173), సూర్యసాయి (302), కణితి శ్రీకార్తిక్ (346), యండ భరత్ (1142), తన్మయ్ రాఘవ (1848), తర్ర సాయి చరణ్ (2035), గుంట సంతోష్ భార్గవ్ (3597), పార్థవనాయుడు (3610), లిఖితారెడ్డి (4489), వి.సీతారాం నాయుడు (4781), సుంకర రోహిత్ (4791), సనపూరి అఖిల్ (5089), సిద్ధార్థ్ ప్రధాన్ (5347), దల్లి మణిదీప్ (5581), పి. వెంకట సాయి కార్తీక్ (5829), వై.సాయిసంక్రీత్ (6267), నయనిపాత్రుని సుమంత్ (6280), ఎస్.అజయ్ కుమార్ (6429), బూరె సిద్ధార్థ (6826), శిరిడీనాథ్ - (7160), ఇజ్జు ఆకాష్ - (7516), హిమకార్తీక (9324), వంజరాపు రమ్యశ్రీ (9982)

జాతీయస్థాయిలో మెరుపులు..

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీకాకుళంలోని బొందిలీపురం సమీపంలో ఉన్న విజయ్‌నగర్‌కాలనీకి చెందిన హనుమంతు నితిన్ ఆలిండియా ఓపెన్‌లో 477వ ర్యాంకు సాధించగా, ఓబీసీ కేటగిరీలో 69వ ర్యాంకుతో మెరిశాడు. శ్రీకాకుళం నగరంలోని గోవింద్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్న యర్నాగుల లావణ్యవాణి 688వ ర్యాంకు, జిల్లాలోని సొండిపుడి గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన యండ భరత్ ఆలిండియా ఓపెన్‌లో 1142వ ర్యాంకు సాధించగా, ఎస్సీ కేటగిరీలో 16వ ర్యాంకుతో మెరిసి జిల్లాకు పేరు తీసుకొచ్చారు. శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న కందుల జోజికుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 2963వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 314వ ర్యాంకుతో విజయబావుటా ఎగురవేశాడు. శ్రీకాకుళంలోని చిన్నబరాటం వీధికి చెందిన సుంకర రోహిత్ ఆలిండియా ఓపెన్‌లో 4791వ ర్యాంకు సాధించాడు. శ్రీకాకుళానికే చెందిన బత్తుల వెంకట సాయి మౌళిక్ ఆలిండియా ఓపెన్‌లో 10965, ఈడబ్ల్యూఎస్‌లో 1509వ ర్యాంకు సాధించాడు. మందస మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గుంట సంతోష్‌భార్గవ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 3597వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 660వ ర్యాంకు, రేగిడి మండలం కొమిరి గ్రామానికి చెందిన పైడి పార్థవనాయుడు ఆలిండియా ఓపెన్‌లో 3610, ఓబీసీ కేటగిరీలో 664వ ర్యాంకు, లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన వడ్డిపల్లి సీతారాం నాయుడు ఆలిండియా ఓపెన్‌లో 4781వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 915వ ర్యాంకుతో మెరిశారు. ఇక పలాసకు చెందిన సనపూరి అఖిల్ ఆలిండియా ఓపెన్‌లో 5089, జనరల్‌లో 596వ ర్యాంకు, పలాసలోని అన్నపూర్ణ ఆశ్రమమంకు చెందిన సిద్ధార్థ్ ప్రధాన్ 5347వ ర్యాంకు, ఓబీసీలో 1046వ ర్యాంకు, శ్రీకాకుళం పీఎన్‌కాలనీకి చెందిన పేరుపు వెంకట సాయి కార్తీక్ 5829వ ర్యాంకు, కాశీబుగ్గకు చెందిన వై.సాయిసంక్రీత్ 6267వ ర్యాంకు, పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన నయనిపాత్రుని సుమంత్ 6280వ ర్యాంకు, పాతపట్నంలోని దుర్గమ్మకాలనీకి చెందిన సంచాన అజయ్‌కుమార్ 6429వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 151వ ర్యాంకు, నందిగాం పెద్దవీధికి చెందిన బూరె సిద్ధార్థ 6826వ ర్యాంకు, పాతపట్నంలోని పెద్దదేవాంగుల వీధికి చెందిన దొంటంశెట్టి శిరిడీనాథ్ 7160వ ర్యాంకు, జేఆర్ పురం సమీపంలోని గరికిపాలెంకు చెందిన ఇజ్జు ఆకాష్ 7516 ర్యాంకుతో రాణించారు.

ఐఐటీలో సూపర్ 60 విద్యార్థుల జోరు

శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉన్న గిరిజన యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో కొనసాగుతున్న ఐఐటీ సూపర్ 60 విద్యార్థులు విజయదుందుభి మోగించారు. తాజాగా వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులతో మెరిశారు. పి.ఆనంద్ 364వ ర్యాంకు, ఎస్.చైతన్య 1591, జి.లక్ష్మీకాంత్ 1678, పి.త్రిష 1774, ఎం.దీపక్ 3896, ఎం.మణికంఠ 5416, పి.శివరామకృష్ణ 5491 వంటి ర్యాంకులు సాధించారు. అలాగే ఏడుగురు విద్యార్థులు వివిధ కేటగిరి ర్యాంకులు సాధించారు. ఇందులో ఎస్.శంకరరావు 3114, పి.ఆనంద్ 3392, ఎం.సాయిరాం 3903, ఎస్.ప్రేమ్‌కుమార్ 4636, ఎస్.చైతన్య 7423, జి.రోహన్‌కుమార్ 8016, ఎం.మణికంఠ 11250లు ఉన్నారు. వీరిని ఐడీడీఏ పీఓ కల్పనా కుమారి, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో లిల్లీరాణి, కోర్సు డైరెక్టర్ బి.మురళీబాబు అభినందించారు.



సీఎస్ఈ లక్ష్యం



జేఈఈ మెయిన్స్‌లో 99.848 పర్సంటైల్‌తో ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులో నిలిచాను. తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్‌లో 2963వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 314వ ర్యాంకు వచ్చింది. మా అమ్మానాన్న, లెక్చరర్స్ చాలా ప్రోత్సహించారు. టాప్ ఐఐటీలో చేరి సీఎస్ఈ చేస్తాను. నాన్న శివశంకర్ పాత్రికేయుడు. అమ్మ సంతోషి గృహిణి. - కందుల జోజి కుమార్

సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడాలని..



జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 688వ ర్యాంకు సాధించినందుకు సంతోషంగా ఉంది. ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో స్టేట్‌లెవల్‌లో 80వ ర్యాంకు సాధించాను. నాన్న యర్నాగుల వాసుదేవరావు జెడ్పీహెచ్‌స్కూల్ కొర్ని హెచ్‌ఎంగా పనిచేస్తుండగా, అమ్మ దేవరాణి శ్రీకూర్మం బాలికల హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఐఐటీలో సీఎస్ఈ చేసి సాఫ్ట్‌వేర్‌లో సెటిల్ అవ్వాలనే ఆలోచన ఉంది. సివిల్స్‌కి కూడా ప్రయత్నిస్తాను. - యర్నాగుల లావణ్య వాణి

పేరెంట్స్ ప్రోత్సాహంతోనే..



మా పేరెంట్స్ ప్రోత్సాహంతోనే జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియా ఓపెన్‌లో 477వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 69వ ర్యాంకు సాధించగలిగాను. ఇటీవలి వెలువడిన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో స్టేట్‌లెవల్‌లో 95వ ర్యాంకు సాధించాను. మా పేరెంట్స్ ఇద్దరూ ప్రభుత్వ టీచర్లే. - హనుమంతు నితిన్

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.1,01,116 వితరణ



విరాళ చెక్‌ను అందజేస్తున్న దాతలు

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన కరణం రవిబాబు, డోల లక్ష్మీ దంపతులు రూ.లక్షా వెయ్యి నూట పదహారులను ఆదివారం ఈవో జి.గురునాథంకు అందజేశారు. ఈ మేరకు ఈవో కార్యాలయంలో చెక్ అందించారు. కార్యక్రమంలో వంశధార సూపరింటెండెంట్ ఇంజినీర్ డోల తిరుమలరావు, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు, పూడి కమల తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సంక్షేమ భవనం నిర్మాణమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపుల సంక్షేమ భవనం నిర్మాణమే లక్ష్యంగా అందరూ ఏకతాటిపైకి రావాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, తూర్పుకాపు సంక్షేమ సంఘ నాయకులు రాడ కైలాశరావు, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, ఇజ్జాడ శివన్నారాయాణమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం తూర్పుకాపు సంక్షేమ సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలాకాలంగా ప్రతిపాదన స్థాయిలో ఉన్న భవనం నిర్మించేందుకు కలిసికట్టుగా ముందుకుసాగాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు సమీకరణ, స్థల పరిశీలన చేసి అందుకు తగినట్లుగా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.వి.స్వరూప్, హారికా ప్రసాద్, లోలుగు కాంతారావు, కద్దాల శ్యామ్, కొమ్మ రమణమూర్తి, ఇప్పిలి శివ, కొండాల గణేష్, వాన కృష్ణచంద్, కరణం శ్రీనివాసరావు, పాండ్రంకి రమేష్, కలిశెట్టి గణపతి, శాసపు జోగినాయుడు, అలుగుబెల్లి నాగభూషణరావు, ఎస్.కె.నాయుడు, లుకలాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌ఏ కోర్సులో పది మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజీలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ప్రవేశాలకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించగా పది మందికి ప్రవేశాలు కల్పించారు. మొత్తం 20 సీట్లు ఉండగా పది మిగిలిపోయాయి. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు కోర్సుకు అర్హులని జిల్లా ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ సంస్థ జాబ్స్ మేనేజర్ రమణమూర్తి తెలిపారు. 100 రోజుల శిక్షణ తరువాత ప్లేస్‌మెంట్ కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 99856 23025 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆధార్ వివరాలను అందించాలి



డీపీటీవో విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తాము పనిచేసిన డిపోలో ఆధార్ కార్డు, అనుసంధాన సెల్ నంబరు వివరాలు అందజేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.వి జయకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని, విశ్రాంత ఉద్యోగికి తెల్ల రేషన్‌కార్డు మంజూరవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనిపెట్టుకుని ఉండాల్సిందే..!



ఎండ వేడికి ట్యాప్ వాటర్ దగ్గర ఉపశమనం పొందుతున్న పెంపుడు కుక్క

- ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం
- పెంపుడు జంతువులకు అందుబాటులో మంచినీరు ఉంచాలి
- ఉదయం, సాయంత్రం సమయాల్లో పశువులకు మేతకు పంపాలి
- అతిగా మామిడి పళ్లు వద్దని వైద్యుల సూచన



ఎండల ప్రభావంతో చెట్ల నీడను ఆశ్రయించిన మేకలు

టెక్కలి: తీవ్రమైన ఎండల ప్రభావం మనుషులతో పాటు మూగజీవాలపై కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో పెంపుడు జంతువుల సంరక్షణలో మరింత బాధ్యతగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు ఇలా పెంపుడు జంతువులు ఎండ ధాటికి గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

- ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు విషయానికి వస్తే ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత వాటిని మేతకు తీసుకువెళ్లాలి.
- పశువులు ఎండల బారిన పడి వడదెబ్బకు గురయ్యే ప్రమాదాలు ఉంటాయి. వడదెబ్బకు గురైన పశువుల్లో నోటి నుంచి సొంగలు, తీవ్రమైన జ్వరంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సమయంలో తక్షణమే పశు వైద్యులను సంప్రదించాలి.
- ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కావడంతో ఆవులు, గేదెలకు అతిగా మామిడి పళ్లు పెట్టవద్దని వైద్యులు సూచిస్తున్నారు. దీని వల్ల కడుపులో నొప్పితో పాటు మామిడి టెంకలు గొంతుకు అడ్డంగా ఉండిపోతాయి.
- వేసవిలో ఎండు గడ్డి కంటే పచ్చి గడ్డి ఎంతో శ్రేయస్కరం. నిత్యం నీళ్లు అందుబాటులో ఉంచాలి.
- గొర్రెలు, మేకలకు ఆరుబయట గాలి తగిలిన ప్రదేశంలో టార్పాలిన్ల నీడలో ఉంచాలి. కోళ్ల విషయంలో నిత్యం వాటికి నీళ్లు అందుబాటులో ఉంచాలి.
- ఇంట్లో పెంచుకునే కుక్కల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలి. ఎండ తీవ్రతకు ఒక్కోసారి మెదడు పై ప్రభావం చూపే ప్రమాదాలు ఉన్నాయి. అంతే కాకుండా వేసవిలో మాంసాహారం తక్కువగా ఇవ్వాలి. నిత్యం చల్లటి ప్రదేశంలో ఉంచాలి. అప్పుడప్పుడు చల్లగా ఐస్ నీరు ఇవ్వాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.

జాగ్రత్త పడాలి



ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పెంపుడు జంతువులపై ఎండ ప్రభావం లేకుండా సంరక్షణ చేయాలి. ఆవులు, గేదెలు, కోళ్ల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పెంపుడు కుక్కల విషయంలో మరింత ప్రత్యేక దృష్టి సారించాలి. కొన్ని రకాల పక్షుల కోసం మేడల పైన మంచినీరు ఏర్పాటు చేస్తే ఎంతో మంచిది.
– వి.జయరాజ్, పశు సంవర్ధక శాఖా డీడీ, టెక్కలి.

మరణంలోనూ వీడని బంధం

- లారీ ఢీకొని భార్యాభర్తలు మృతి
- శుభకార్యానికి వచ్చి, తిరిగి వెళ్తుండగా ఘటన
- బాడాంలో విషాదఛాయలు



మృతిచెందిన త్రిమూర్తులు, నాగమణి(ఫైల్)

కోటబొమ్మాళి/నరసన్నపేట: శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి చెందారు. ఈ విషాద ఘటన కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట మండలం బాడాం గ్రామానికి చెందిన బమ్మిడి త్రిమూర్తులు(45), నాగలక్ష్మి(40) దంపతులు శనివారం కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేటలో జరిగిన శుభకార్యానికి వచ్చారు. భోజనాల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో స్వగ్రామానికి వెళ్లేందుకు సుబ్బారావుపేట జంక్షన్‌లో జాతీయ రహదారి వద్దకు చేరుకుని బస్సు కోసం వేచిచూస్తున్నారు. ఇంతలో టెక్కలి వైపు నుంచి అతివేగంగా వస్తున్న లారీ వీరిద్దరినీ ఢీకొట్టింది. ఈ ఘటనలో త్రిమూర్తులు అక్కడికక్కడే మృతిచెందగా, కొనఊపిరితో ఉన్న నాగలక్ష్మిని 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు మురళి, మణి, లక్ష్మణ ఉన్నారు. అందరూ చదువుతున్నారు. పెద్దకుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. త్రిమూర్తులు, నాగమణి దంపతులు పేద కుటుంబానికి చెందిన వారు. రోడ్డు ప్రమాదంలో ఒకేసారి మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది. దంపతుల మృతి పట్ల సర్పంచ్ డోల గోవిందరావు సంతాపం వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

- మూడు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



ముత్యాలపేటరోడ్డులో స్తంభాలను మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

కవిటి: మండలంలోని ముత్యాలపేట, కపాసుకుద్ది వెళ్లే మార్గంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇసుకను లబ్ధిదారులకు అందిస్తున్న క్రమంలో అర్ధరాత్రివేళ ఈ మార్గంలో భారీగా వాహనాల రాకపోకలు కొన్నాళ్లుగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి అతివేగంతో వచ్చిన వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో వెంటనే సరఫరా నిలిచిపోయింది. దీంతో ముత్యాలపేట, కె.కపాసుకుద్ది, సీహెచ్‌కపాసుకుద్ది గ్రామాలకు సుమారు 30 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రాంబుడ్డి కామేష్(ఫైల్)

సోంపేట: మండలంలోని కొర్లాం పంచాయతీ శాంతి నగర్‌కు చెందిన రాంబుడ్డి కామేష్ (34) ఆదివారం తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేష్ తన భార్య స్వప్నతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట స్వప్న బారువలోని కన్నవారింటికి వెళ్లిపోయింది. మనస్థాపం చెందిన కామేష్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి కుమార్తె రేష్మ, కుమారుడు దినేష్ ఉన్నారు. కామేష్ తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

25న ప్రజాప్రతినిధుల సత్కార సభ



మాట్లాడుతున్న ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులంతా ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేయడం మంచి సంప్రదాయమని ఏపీ ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. ఈ నెల 25న స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో జరగనున్న సత్కార సభా సన్నాహక సమావేశం శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ పలువురు ప్రజాప్రతినిధులను సత్కరించేందుకు కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ తీర్మానించిందని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా తమను రెగ్యులర్ చేయాలంటూ కాంట్రాక్టు ఉద్యోగుల పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందన్నారు. మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ అయ్యేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రజాప్రతినిధులను ఈ నెల 25న సత్కరిస్తామని చెప్పారు. కమిటీలు వేసుకుని కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. సమావేశంలో కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

22న ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు ఈ నెల 22న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. వెబ్‌సైట్‌లో పేర్కొన్న అర్హతలు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో కీలకపాత్ర ఇంజినీర్లదే

- గత ప్రభుత్వ అవినీతి అక్రమాల్లో ఇంజినీర్లను బాధ్యులు చేయొద్దు
- పీఆర్ డిప్లమో ఇంజినీర్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు రవీంద్ర




రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న మహంతి తదితరులు

అరసవల్లి: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో జరుగుతున్న గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పంచాయతీరాజ్ ఇంజినీర్లదేనని.. పాలక ప్రభుత్వ నిర్ణయాల మేరకు మాత్రమే తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్న సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలని పీఆర్ డిప్లమో ఇంజినీర్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కె.రవీంద్ర స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దల ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనల మేరకు మాత్రమే ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో పనులు చేస్తున్నారని స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖలో జరిగిన అవినీతి అక్రమాల్లో తమను బాధ్యులు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై విజిలెన్స్ ఇచ్చిన నివేదికల మేరకు పీఆర్ ఇంజినీర్లపై చర్యలకు దిగరాదని కోరారు. అంతకుముందు జిల్లా పీఆర్ డిప్లమో ఇంజినీర్ల సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలు, సంఘం తరపున నివేదికలు వివరించారు. పీఆర్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న టి.ఎ, జె.టి.ఓ, ఏఈ, పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మహంతి కోరారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి బి.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగుల సంక్షేమం చేపట్టాలన్నారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కేసీహెచ్.మహంతి, ఎస్‌వీఏ.పోలినాయుడు, అడ్వైజర్ పల్లె నర్సింహులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణారావు, ఎస్.సత్యనారాయణ, పి.నిత్యానందం, కె.గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



ఉన్నతాధికారులకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్



ట్రస్ట్ బోర్డు సభ్యుడు మండవిల్లి రవిని ఆశీర్వదిస్తున్న శంకరశర్మ

అరసవల్లి: ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు ఆదిత్యుని దర్శనానికి బారులు తీరారు. ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక, ఉచిత, విశిష్ట దర్శనానికి వచ్చే మార్గాల్లో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచడంతో దాహార్తి ఇబ్బందులు తలెత్తలేదు. ఆలయం బయట భారీగా షెడ్లు వేయడంతో ఎండ నుంచి ఉపశమనం దక్కింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,29,200, విరాళాల ద్వారా రూ.44,693, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ఈఓ వివరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారులు..

సెంట్రల్ మైన్స్ జాయింట్ డైరక్టర్ కెంబూరు ఇందూధరరావు, ఏపీ స్టేట్ ఫైనాన్స్ నోడల్ ఆఫీసర్ ప్రియాంక నషీనే ఆదివారం ఉదయం ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

జూడో పోటీల్లో నితిన్‌కు కాంస్యం



నితిన్‌ను అభినందిస్తున్న జూడో ఫెడరేషన్ సంఘం సభ్యులు

పొందూరు: తిరుపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ క్యాడెట్ జూడో పోటీల్లో పొందూరు మండలం తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కొత్తకోట నితిన్ కాంస్య పతకం సాధించాడని ప్రధానోపాధ్యాయుడు బల్ల కంటయ్య, పీఈటీ ధవళ తెలిపారు. నితిన్ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు.

విద్యార్థి కాంస్య పతకం సాధించడం పట్ల జిల్లా సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి పైడి సునీత, జిల్లా జూడో కోచ్ మణికుమార్, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ ఉమేష్‌కుమార్ సింగ్, ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- వైఎస్సార్ సీపీలో 50 కుటుంబాల చేరిక



మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో పార్టీలో చేరిన మత్స్యకారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కుందువానిపేట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. పెదపాడులో మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యకారులకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ మత్స్యకారులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే మూలపేట పోర్టు పనులు, బుడగట్లపాలెం హార్బరు పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

పోర్టు, హార్బర్లు అందుబాటులోకి వస్తే ఇతర రాష్ట్రాల్లోకి మత్స్యకార వలసలు ఆగిపోతాయన్నారు. మూలపేట పోర్టు పూర్తయితే మనమే ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంటామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేసినా, వేయకపోయినా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు యథావిధిగా అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం హామీలు అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,110–00
బంగారం(22సి. 10గ్రా.)	55,100–00
వెండి (కిలో)	78,800–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ.554.00
శ్రీకాకుళం	రూ.554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹160	₹275	₹ 295